# సాక్షి తిరుపతి

శుక్రవారం । 20 । డిసెంబర్ । 2024






**యథేచ్ఛగా ప్రభుత్వ స్థలం ఆక్రమణ**

రేణిగుంట మండలంలోని పన్నీరుకాల్వకు వెళ్లే మార్గంలో ఉన్న ప్రభుత్వ భూములు యథేచ్ఛగా ఆక్రమణకు గురవుతున్నాయి. - 8లో



**ఖరారుపై దోబూచులు**

తుడా చైర్మన్ పదవిపై పలువురు ఆశలు పెట్టుకున్నారు. ఈ పదవి కేటాయింపుపై టీడీపీ అధిష్టానం దోబూచులాడుతోంది. - 8లో



**రూ. కోటి విరాళం**

సీఎస్ఆర్‌లో భాగంగా జిల్లా విపత్తు సహాయ నిధికి శ్రీసిటీ పరిశ్రమలు రూ.కోటి విరాళం అందజేశాయి. - 8లో

## న్యూస్‌రీల్

### బ్రహ్మోత్సవాలు విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న ఈఓ బాపిరెడ్డి

**శ్రీకాళహస్తి:** రానున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను సమన్వయంతో విజయవంతం చేద్దామని శ్రీకాళహస్తీశ్వరాలయ ఈఓ బాపిరెడ్డి అన్నారు. పరిపాలన భవనంలో ఆలయ అన్ని శాఖల ఉద్యోగులతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ ఫిబ్రవరిలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు రానున్నాయన్నారు. ఇందుకు ఇప్పటి నుంచే ప్రణాళికబద్ధంగా పనులను ప్రారంభించాలన్నారు. ఆయా శాఖల వారు తమకు అప్పగించిన పనులను సమన్వయంతో పూర్తి చేయాలన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

### డిజిటల్ చెల్లింపులపై అవగాహన అవసరం




మాట్లాడుతున్న ఎల్డీఎం చీఫ్ మేనేజర్ విశ్వనాథరెడ్డి

**రామచంద్రాపురం:** డిజిటల్ చెల్లింపులపై అవగాహన అవసరమని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అసిస్టెంట్ జనరల్ మేనేజర్ పూర్ణిమ అన్నారు. గురువారం మండలంలోని వెలుగు కార్యాలయంలో డ్వాక్రా మహిళలకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆన్‌లైన్ పేమెంట్‌కు సంబంధించిన ఓటీపీలు ఎవరూ అడిగినా చెప్పవద్దన్నారు. అనంతరం ఎల్డీఎం చీఫ్ మేనేజర్ విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ డ్వాక్రా మహిళలకు బ్యాంకులు విరివిగా రుణాలు మంజూరు చేస్తున్నారని తెలిపారు. మహిళలు బ్యాంకు రుణాల ద్వారా ఆర్థికంగా అభివృద్ధి సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో సప్తగిరి గ్రామీణ బ్యాంకు మేనేజర్ రాధాకృష్ణ, ఏరియా కోఆర్డినేటర్ వరలక్ష్మి, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు సుధాకర్, పార్వతి పాల్గొన్నారు.

# వసతి..వైద్యం..కునుకు

అసలే వర్షాకాలం.. ఆపై చన్నీటి స్నానం.. ప్రబలుతున్న దగ్గు, జలుబు, జ్వరం.. అందని ద్రాక్షగా వైద్యం.. వసతి గృహాల వైపు కన్నెత్తి చూడని వైద్యఆరోగ్య శాఖ బృందం.. వెరసి.. హాస్టల్ విద్యార్థి బాధలమయం.. అయినా పట్టించుకోని అధికార గణం.. సాకు చూపి సాగనంపుతున్న వసతి గృహ యంత్రాంగం.. తప్పని పరిస్థితిలో తల్లిదండ్రులు తమ బిడ్డలను ఇళ్లకు తీసుకెళ్లి, వైద్యం చేయిస్తున్న వైనం.. ప్రభుత్వ వసతి గృహాల్లో నెలకొన్న దుస్థితికిదీ నిదర్శనం.





తిరుపతి బీసీ బాలికల హాస్టల్‌లో పేరుకుపోయిన చెత్త





తిరుపతి బీసీ హాస్టల్‌లో ఓ తలుపు దుస్థితి



ఓ గురుకుల వసతిగృహంలో చన్నీటితో స్నానం చేస్తున్న విద్యార్థులు

## వైద్య శిబిరాల ఊసేది?

ప్రభుత్వ వసతి గృహాల్లో నిరుపేద, మధ్యతరగతికి చెందిన విద్యార్థులే అధికశాతం మంది విద్యనభ్యసిస్తున్నారు. వాతావరణ పరిస్థితుల కారణంగా తరచూ విద్యార్థులు అనారోగ్యానికి గురవుతున్నారు. ప్రధానంగా జ్వరం, తలనొప్పి, కడుపునొప్పి, చర్మవ్యాధులు, దురదలు, తామర, వాంతులు, విరోచనాలు తదితర వ్యాధులు విద్యార్థులను పట్టి పీడిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితిలో విద్యార్థులను క్రమం తప్పకుండా పరీక్షించి వైద్యసేవలు అందించాల్సిన బాధ్యత జిల్లా వైద్య ఆరోగ్య శాఖపై ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ప్రాంతాల్లో సామాజిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు, సిబ్బంది వసతి గృహాల్లో వైద్య శిబిరాలు నిర్వహించి, వైద్య సేవలు అందించాల్సి ఉంది. ప్రతి రోజూ సంబంధిత వైద్య సిబ్బంది వసతి గృహాలను సందర్శించడంతోపాటు స్థానిక వైద్యాధికారి వారానికి ఒకసారైనా పర్యవేక్షించాల్సి ఉంది. విధిగా ప్రతి 15 రోజులకోసారి వైద్యశిబిరాలను నిర్వహించాలి. ఇలాంటి పరిస్థితి జిల్లాలో ఎక్కడా కనిపించడం లేదు.

### సాకు చూపి సాగనంపుతున్నారు!

- ప్రభుత్వ వసతి గృహాలపై ఆరోగ్యశాఖ శీతకన్ను
- విద్యార్థుల వసతి గృహాల్లో వైద్యశిబిరాల ఊసే లేదు
- సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నా పట్టించుకోని అధికారులు
- తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి చేతులు దులుపుకుంటున్న వైనం
- దయనీయంగా మారుతున్న హాస్టల్ విద్యార్థుల పరిస్థితి
- అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న విద్యార్థి సంఘాలు

**తిరుపతి సిటీ:** జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో ప్రభుత్వ వసతి గృహాలు, గురుకులాల్లో విద్యార్థుల పరిస్థితి దయనీయంగా మారింది. వసతుల లేమికి తోడు, ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టడంతో వైరల్ ఫీవర్ బారినపడుతున్నారు. వేడినీటి సౌకర్యం అంతంతమాత్రంగా ఉండడంతోపాటు విద్యార్థులకు వైద్యసేవలు అరకొరగా అందుతున్నాయి. వర్షాకాలం కావడంతో విద్యార్థులు జ్వరాలు, చర్మవ్యాధులు, దగ్గు, జలుబు తదితర వ్యాధులతో జిల్లాలో అన్ని వసతి గృహాల్లోని విద్యార్థులు అధిక శాతం మంది ఇక్కట్లు పడుతున్నారు. వ్యక్తిగత శుభ్రత, ఆరోగ్య సంరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించాల్సిన జిల్లా వైద్యశాఖ అంటీముట్టనట్లు వ్యవహరిస్తోందని విమర్శలున్నాయి. అస్వస్థతకు గురైన విద్యార్థులకు వైద్యసేవలు అందించకుండా హాస్టల్ సిబ్బంది తల్లిదండ్రులకు సమాచారం అందించి, చేతులు దులుపుకుంటోంది. ప్రతి హాస్టల్‌లో సుమారు 40 శాతం మందికిపైగా వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నారని విద్యార్థి సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### పాఠాలు నేర్వని వైద్యశాఖ

ఇటీవల జిల్లాలోని సూళ్లూరుపేట, తిరుపతి ప్రభుత్వ వసతి గృహాలు, గురుకులాల్లోనూ పెద్ద సంఖ్యలో పలుసార్లు విద్యార్థులు అస్వస్థతకు గురై జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్స అందజేశారు. అయినా జిల్లా విద్యాశాఖ, వైద్యశాఖ యంత్రాంగం పాఠాలు నేర్వలేదు. వైద్య శిబిరాలు, తగిన మందులు, మాత్రలు అందుబాటులో ఉంచడంలేదు. వైద్యుల పర్యవేక్షణ తూతూమంత్రంగా ఉంది. జలుబు, జ్వరం మాత్రలు తప్ప ఎటువంటి మందులు వసతి గృహాల్లో లేవు. కడుపునొప్పి, వాంతులు, విరోచనాల బారిన పడిన విద్యార్థులకు బయటి నుంచి మందులు తెచ్చుకోమని ఉచిత సలహా ఇస్తున్నారు. మెడికల్ కిట్‌ల ప్రస్తావనే లేదు. విద్యార్థులు ఏ చిన్న జబ్బు చేసినా తల్లిదండ్రులపై ఆధారపడాల్సిన దుస్థితి ప్రతి హాస్టల్‌లో కనిపిస్తోంది.



తిరుపతి బాలికల హాస్టల్ దుస్థితి

### జిల్లాలో వసతి గృహాల వివరాలు

| | ప్రభుత్వ వసతి గృహాలు | మొత్తం విద్యార్థులు |
|---|---|---|
| ఎస్సీ, ఎస్టీ | 62 | 5,015 |
| బీసీ | 64 | 5,518 |
| గురుకులాలు | 10 | 6,642 |
| మొత్తం | 136 | 17,175 |

### క్రమం తప్పకుండా సందర్శిస్తున్నాం



జిల్లాలోని అన్ని ప్రభుత్వ వసతిగృహాలను ఏఎన్ఎంలు, వైద్యులు క్రమం తప్పకుండా సందర్శించి విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నారు. నిబంధనల ప్రకారం వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నాం. అవసరమైన మందులు, మాత్రలు అందుబాటులో ఉంచాం. ఎక్కడైనా ఇబ్బందులు ఉన్నట్లు తెలిస్తే వెంటనే చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నాం.

–డాక్టర్ శ్రీహరి, డీఎంహెచ్ఓ, తిరుపతి జిల్లా

### అవగాహన లేక చన్నీటి స్నానం చేస్తున్నారు



చలికాలంలో సైతం విద్యార్థులు చన్నీటి స్నానం చేస్తున్నారు. దీంతో జ్వరం, తలనొప్పి, ముక్కుదిబ్బడ, శ్వాసకోస వ్యాధులు దరిచేరే ప్రమాదం ఉంది. కానీ వైద్యులు, హాస్టల్ సిబ్బంది విద్యార్థులకు సరైన అవగాహన కల్పించడం లేదు. మా అమ్మాయి బీసీ హాస్టల్‌లో పదో తరగతి చదువుతోంది. రెండు నెలలుగా ఇప్పటికీ రెండుసార్లు జ్వరం బారిన పడింది. ఇంటికి తీసుకెళ్లి నయం చేసి, హాస్టల్‌లో వదిలిపెట్టాం. హాస్టల్‌లో మందుల కొరత ఉంది. కానీ పట్టించుకోరు. పిల్లలకు జలుబు వచ్చినా తల్లిదండ్రులకు ఫోన్ చేయిస్తున్నారు.

– జీ రమణారెడ్డి, తిరుపతి

### జ్వరం వచ్చింది తీసుకుపోండంటున్నారు!



మా అబ్బాయి ప్రభుత్వ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతూ ఎస్సీ బాలుర వసతిగృహంలో ఉంటున్నాడు. వారం రోజుల క్రితం జ్వరం రావడంతో హాస్టల్ సిబ్బంది ఫోన్ చేసి, మీ అబ్బాయి జ్వరం వచ్చింది తీసుకెళ్లండంటూ కాల్ చేశారు. వసతి గృహాల్లో డోలో 650 మాత్రలు తప్ప ఇంకేమీ లేవు. వైద్య సిబ్బంది, అటు వైపు కూడా చూడరు. దీంతో మా అబ్బాయి ఇంటికి తీసుకువచ్చి ప్రైవేటు ఆస్పత్రిలో చూపించి, హాస్టల్‌లో వదిలి వచ్చాను. ప్రభుత్వం హాస్టళ్లలో మందులు, మాత్రలు తగినన్ని అందుబాటులో ఉంచడం లేదు.

– ప్రమీళమ్మ, తిరుపతి రూరల్

### మందుల కొరత, పర్యవేక్షణ లోపం



ప్రభుత్వ వసతిగృహాల్లో అవసరమైన మందులు, మాత్రలు అంతంతమాత్రంగా ఉంటున్నాయి. విద్యార్థులు అస్వస్థతకు గురైతే అంతే సంగతులు. వెంటనే తల్లిదండ్రులకు తెలియజేయడం తప్ప వైద్యసిబ్బందిని పిలిపించి, తగిన మందులు ఇవ్వడం లేదు.వైద్య సిబ్బంది నెలలో ఏదో ఒకరోజు అలా వచ్చి.. ఇలా వెళుతుంటారు. విద్యార్థులకు శీతాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించిన దాఖలాలు లేవు. కొన్ని హాస్టళ్లలో విద్యార్థులకు చన్నీటి స్నానమే గతి. వేడినీటి సరఫరా చేయడం లేదు. అధికారుల పర్యవేక్షణ లోపం స్పష్టంగా కనిపిస్తోంది.

–ఆశా, పీడీఎస్ఓ, జిల్లా కార్యదర్శి, తిరుపతి జిల్లా

# ఉద్యోగ పాఠవం అందేనా?

డీఎస్సీ.. నేటి యువత కలల లోకం.. కళ్లెదుట సాక్షాత్కరించినట్టే కనిపించి.. కనుచూపు మేరకు అందనంత దూరంలోకెళ్లింది. అయినా పట్టువదలని విక్రమార్కుల్లా ఉద్యోగ పోరాటానికి వేలాది మంది నిరుద్యోగులు సన్నద్ధమవుతున్నారు. వీరిలో రూ.లక్షలు ఖర్చు చేసి, కోచింగ్ తీసుకోలేని నిరుపేదలైన ఎస్సీ, ఎస్టీలకు సర్కారు ఉచిత శిక్షణ ఇస్తామంటూ ఊరిస్తోందే తప్ప.. ఇవ్వడం లేదు. దీంతో నిరుద్యోగులు తమకు ఉద్యోగ పాఠం అందుతుందో లేదోనని ఆందోళన చెందుతున్నారు.

- డీఎస్సీ ఉచిత కోచింగ్ ఎప్పటికో?
- రెండు నెలల క్రితమే దరఖాస్తులు స్వీకరణ
- ఎస్సీ, ఎస్టీల నుంచి 300 దరఖాస్తులు
- ఉచిత శిక్షణ కోసం వేచి ఉన్న విద్యార్థులు



ఉచిత కోచింగ్‌లో బీసీ విద్యార్థులు

**తిరుపతి అర్బన్:** సీఎం చంద్రబాబు ప్రమాణస్వీకారం అనంతరం డీఎస్సీ నిర్వహణపై తొలి సంతకం పెట్టారు. ఆయన సంతకం పెట్టి ఆరునెలలు పూర్తి అయింది. అయితే ఇప్పటివరకు డీఎస్సీ పరీక్షపై స్పష్టత లేదు. పరీక్ష నిర్వహణ..పోస్టులు కేటాయింపు, డీఎస్సీ నిర్వహణపై కూటమి ప్రభుత్వం వాయిదాల పర్వం కొనసాగిస్తోంది. ప్రభుత్వ తీరుతో డీఎస్సీ 2024 నోటిఫికేషన్ కాస్త 2025 డీఎస్సీగా మారింది. ఇదంతా అటుంచితే ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా డీఎస్సీలో శిక్షణ ఇస్తామని, పెద్ద ఎత్తున ప్రచారం చేసిన ప్రభుత్వం దాన్ని పక్కన పెట్టేసిందని పలువురు మండిపడుతున్నారు.

**ఉచిత శిక్షణకు పరీక్షలు ఎప్పుడో...**

డీఎస్సీ ఉచిత శిక్షణ ఇవ్వడానికి దరఖాస్తులు చేసుకున్న వారిలో 50 శాతం మందిని ఎంపిక చేసుకోవడానికి పరీక్షలు ఎప్పుడు నిర్వహిస్తారో? తెలియని దుస్థితి నెలకొంది. పరీక్షలు అనంతరం మెరిట్ విద్యార్థులను ఎంపిక చేయడానికి ఎంతకాలం పడుతుందో తెలియడం లేదు. ఆ తర్వాత శిక్షణ ఎప్పుడు ఇస్తారో అర్థం కావడం లేదంటూ పలువురు అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**డీఎస్సీ ఇప్పట్లో లేనట్టేనా?**

ఇప్పటివరకు ఎస్సీ, ఎస్టీలకు ఉచిత డీఎస్సీ శిక్షణ మొదలు కాలేదు. ఈ క్రమంలో డీఎస్సీ పరీక్ష ఇప్పట్లో ఉండేలాలేదని పలువురు అంటున్నారు. అయితే విద్యార్థులు మాత్రం గంపెడు ఆశలతో ఎదురుచూస్తున్నారు. ఎందుకు విద్యార్థులను ఇలా ఆశపెట్టడం అంటూ పలువురు మండిపడుతున్నారు. మొత్తంగా డీఎస్సీకి పోటీపడుతున్న వారికి ప్రభుత్వ తికమక నిర్ణయాలతో తలనొప్పులు తప్పడం లేదు.

**ఎస్సీ, ఎస్టీలకు డీఎస్సీ ఉచిత శిక్షణ అందేనా?**

డీఎస్సీ పరీక్షలకు పోటీపడుతున్న ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ప్రభుత్వం ఇచ్చే ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోండంటూ రెండు నెలల క్రితం దరఖాస్తులు ఆహ్వానించారు. అయితే ఇప్పటివరకు ఆ ఊసేలేదు. 300 మందికి పైగా ఎస్సీ, ఎస్టీలు ఉచిత డీఎస్సీ శిక్షణ కోసం దరఖాస్తులు చేసుకున్నారు. అందులో 150 మందికి మాత్రమే ఉచిత శిక్షణ ఇస్తామని తర్వాత ప్రకటించారు. ఆ తర్వాత 300 మందికి పరీక్షలు నిర్వహించి వారిలో మెరిట్ విద్యార్థులను 150 మందిని ఎంపిక చేస్తామని ఎస్సీ వెల్ఫేర్ అధికారులు ప్రకటించారు. ఈ క్రమంలో అంతా పరీక్షలకు సిద్ధం అవుతున్న తరుణంలో పరీక్షలు వాయిదా వేశారు. దీంతో వారంతా ఆందోళన చెందుతున్నారు.

**బీసీ విద్యార్థులకు జనవరి 16తో శిక్షణ ముగింపు**

తిరుపతిలోని ఎమ్మార్‌పల్లి సర్కిల్ వద్ద బీసీ స్టడీ సెంటర్‌లో నవంబర్ 16 నుంచి 220 బీసీ విద్యార్థులకు డీఎస్సీ ఉచిత శిక్షణ ఇస్తున్నారు. రెండు నెలల ఉచిత శిక్షణ సందర్భంగా జనవరి 16తో వారి శిక్షణ ముగుస్తుంది. ఆ తర్వాత డీఎస్సీ పరీక్ష ఎప్పుడు ఉంటుందోనని ఆందోళన చెందుతున్నారు. అయితే బీసీ విద్యార్థులకు ఇస్తున్న ఉచిత కోచింగ్‌లో వసతి, భోజనం సౌకర్యాలను కల్పించలేదు. పుస్తకాల కోసం రూ.వెయ్యి చొప్పున, స్టయిఫండ్‌గా నెలకు రూ.1500 చొప్పున మాత్రమే అందిస్తున్నారు.

### ఆదేశాలు వస్తేనే



ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇవ్వడానికి దరఖాస్తులు స్వీకరించిన సంగతి తెలిసిందే. అయితే వారికి పరీక్ష నిర్వహించి కొంత మందిని మాత్రమే ఉచిత శిక్షణ ఇవ్వడానికి ఎంపిక చేస్తాం. విజయవాడ నుంచి ఉన్నతాధికారుల ఆదేశాలు ఇస్తేనే ఎంపిక కోసం పరీక్ష నిర్వహిస్తాం. ఆ తర్వాత వారి ఆదేశాల మేరకు ఉచిత శిక్షణ ఇస్తాం.

– చెన్నయ్య, ఎస్సీ వెల్ఫేర్ జిల్లా అధికారి

## రుణాలు సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శోభనబాబు

**తిరుపతి అర్బన్:** ప్రధానమంత్రి అనుసూచిత జాతీయ అభ్యుదయ యోజన పథకం ద్వారా అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ శోభనబాబు తెలిపారు. ఈ స్కీమ్‌లో ఎంపిక చేసిన 106 మందికి గురువారం డీఆర్‌డీఏ కార్యాలయంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఏ పీడీ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వానికి చెందిన ఈ పథకానికి ఏపీ ఎస్సీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా ఎస్సీలకు మాత్రమే రూ.లక్ష నుంచి రూ.3 లక్షల వరకు రుణాలు అందిస్తారని తెలిపారు. 10 శాతం మాత్రమే లబ్ధిదారుల వాటాగా ముందుగా డిపాజిట్ చేయాల్సి ఉంటుందన్నారు. మిగిలిన మొత్తాన్ని బ్యాంక్ ద్వారా అందిస్తారని చెప్పారు. ఈ పథకానికి అర్హులైన వారు ప్రధానంగా ఉత్పత్తి రంగం, సేవా రంగం, వ్యాపార రంగానికి చెందిన ఏదైనా పని చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ అడిషనల్ పీడీ ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.





## వచ్చే ఏడాది నుంచి డీడీఈ అడ్మిషన్లు షురూ!

- జనవరి మొదటి వారంలో ఎస్వీయూలో యూజీసీ కమిటీ పర్యటన
- వచ్చేనెల 18నుంచి దూరవిద్య పరీక్షల నిర్వహణ

**తిరుపతి సిటీ:** ఎస్వీయూలోని డైరెక్టర్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ ద్వారా వచ్చే ఏడాది నుంచి అడ్మిషన్లు ప్రారంభించేందుకు వర్సిటీ అధికారులు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే వర్సిటీ అధికారుల బృందం న్యూఢిల్లీ వెళ్లి డీడీఈలో నిలిచిపోయిన అడ్మిషన్లను పునరుద్ధరించాలని యూజీసీకి విన్నవించారు. ఈ నేపథ్యంలో జనవరి మొదట వారంలో యూజీసీ కమిటీ వర్సిటీలో పర్యటించి, డీడీఈ అడ్మిషన్ల ప్రకియను కొనసాగించేందుకు ఉన్న అర్హతలు, సదుపాయాలను పరిశీలించి అనుమతులు ఇవ్వనుంది. దీంతో వచ్చే ఏడాది నుంచి యూజీ, పీజీ, డిప్లొమా కోర్సులకు అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం దాదాపు ఖరారైనట్లు తెలుస్తోంది. దీంతో కొంత కాలంగా దూరవిద్య ద్వారా డిగ్రీ, పీజీ చేసేందుకు ఎదురు చూస్తున్న విద్యార్థులకు కాస్త ఊరట కలిగించనుంది.





ఎస్వీయూ డీడీఈ భవనం

**వచ్చే నెల 18 నుంచి దూరవిద్య పరీక్షలు**

ఎస్వీయూ డీడీఈ పరిధిలో 2021–22లో అడ్మిషన్లు పొందిన యూజీ, పీజీ, డిప్లొమో కోర్సుల విద్యార్థులకు వచ్చే నెల 18వ తేదీ నుంచి పరీక్షలు నిర్వహించనున్నారు. అలాగే పెండింగ్‌లో ఉన్న అన్ని కోర్సుల పరీక్షలను నిర్వహించేందుకు వర్సిటీ అధికారులు సన్నద్ధమవుతున్నారు. జనవరి 2వ తేదీ నుంచి ప్రారంభం కావాల్సిన ఈ పరీక్షలు, యూజీసీ కమిటీ పర్యటన నేపథ్యంలో వర్సిటీ అధికారులు వాయిదా వేశారు.

## క్లుప్తంగా

### పంట బీమాకు దరఖాస్తు చేసుకోండి

**తిరుపతి అర్బన్:** రబీ సీజన్ 2024–25కి సంబంధించి ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం ద్వారా రైతులు పంట బీమాకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉందని జిల్లా వ్యవసాయశాఖ అధికారి(డీపీఓ) ఎస్. ప్రసాద్‌రావు వెల్లడించారు. గురువారం ఆయన మాట్లాడుతూ వేరుశనగ, మామిడికి ఈ నెల 15 వరకు గడువు ఇచ్చామని, అయితే తాజాగా ఈ నెల 31 వరకు గడువు పొడిగించామని చెప్పారు. వరి పంటకు ఈ నెల 31 వరకు సమయం ఉందని తెలిపారు. రబీ సీజన్‌కు సంబంధించి వరి పంటకు ఎకరానికి రూ.630 ప్రీమియం చెల్లించాలని చెప్పారు. వేరుశనగకు ఎకరానికి ప్రీమియం రూ.450 చెల్లించాలని తెలిపారు. మామిడి ఎకరానికి రూ.1,750 ప్రీమియం చెల్లించాలని చెప్పారు. వరి, వేరుశనగ పంటల బీమాను నేషనల్ క్రాప్ ఇన్సూరెన్స్ పోర్టల్(ఎన్‌సీఐపీ), మామిడి పంట బీమాను పీఎంఎఫ్‌పీపై పోర్టల్‌లో నమోదు చేసుకోవాలన్నారు.


### మెస్‌లో అగ్నిప్రమాదం

**తిరుపతి క్రైం:** నగరంలోని మధురనగర్ పరిధిలో ఉన్న ఓ మెస్‌లో గ్యాస్ లీకేజీ కారణంగా అగ్నిప్రమాదం సంఘటన గురువారం చోటు చేసుకుంది. అన్నిమాపక శాఖ అధికారులు కథనం మేరకు.. నాయుడు టిఫిన్ సెంటర్‌లో వంట చేస్తుండగా గ్యాస్ లీక్ అయింది. అకస్మాత్తుగా మంటలు చెరగడంతో.. విషయం తెలుసుకున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. సుమారు రూ.10 వేల విలువ చేసే సామగ్రి కాలిపోయినట్లు బాధితులు తెలిపారు.

### నలంద విద్యావిధానం ఓ జీవన విధానం

**తిరుపతి సిటీ:** నలంద విశ్వవిద్యాలయ విద్యావిధానం ఓ జీవిత విధానం అని ఆ వర్సిటీ పూర్వ ఆచార్య మిట్టపల్లి రాజేశ్వర్ పేర్కొన్నారు. పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఆంగ్లశాఖ ఆధ్వర్యంలో మాజీ వీసీ ప్రొఫెసర్ వీణనోబుల్‌దాస్ 7వ స్మారక ధర్మనిధి ఉపన్యాసం సావేరీ సమావేశ మందిరంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్, తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్, నలంద యూనివర్సిటీ పూర్వ ఆచార్యులు మిట్టపల్లి రాజేశ్వర్ వక్తగా వ్యవహరించి, 'నలంద మోడల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ – 21 సెంచరీ కాంటెక్స్ట్' అనే అంశంపై ప్రసంగించారు. ప్రస్తుతం భారత ప్రభుత్వం ఆచరిస్తున్న జాతీయ విద్యా విధానంలో నలంద విశ్వవిద్యాలయం ఆచరిస్తున్న విద్యా విధానం నుంచి సంగ్రహించాల్సిన అంశాలు చాలా ఉన్నాయన్నారు. నలంద విశ్వవిద్యాలయ విద్యావిధానం అన్నది ఒక జీవిత విధానమని, 21వ శతాబ్దంలో అది ప్రతి ఒక్క విద్యావ్యవస్థ పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమానికి సోషల్ సైన్సెస్ డీన్ సి వాణి, ఆంగ్ల విభాగధిపతి ఆచార్య శారద, హరిపద్మారాణి, నిర్మల పాల్గొన్నారు.

నామినేటెడ్ పదవుల పందేరం ముగిసింది.. ఇక మిగిలింది అత్యంత ప్రతిష్ఠాత్మక పీఠం.. తిరుపతి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ పదవి. ఇది ఎవరికి దక్కుతుందోనన్న ఉత్కంఠ నెలకొంది. పలు సామాజిక వర్గాలకు ఆధ్యాత్మిక నగరి పట్టుండడంతో తుడా కుర్చీ కోసం ఎవరికి వారు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే దీనిపై అధినాయకత్వం దోబూచులాడుతోంది. పెదబాబు మనసులో ఒకరు.. చినబాబు మరొకరు ఉన్నట్లు సమాచారం. మరి ఎవరిని వరిస్తుందో వేచి చూడాలి.






# ఊరించే ఆశలు.. ఖరారుపై దోబూచులు

- తుడా పీఠంపై భారీగా ఆశావహులు
- ఎవరి ప్రయత్నాల్లో వారు
- బాబు ఒకరి కోసం.. చినబాబు ఇంకొకరి కోసం
- కాపు, యాదవ సామాజిక వర్గాలకు కూడా తుడా లేనట్టేనని ప్రచారం
- ఓ కాంట్రాక్టర్, రాజు సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి పేర్లు తెరపైకి

**సాక్షి ప్రతినిధి, తిరుపతి:** నామినేటెడ్ పదవుల పందేరం దాదాపు పూర్తయినా.. తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా) చైర్మన్ పదవిపై సస్పెన్స్ కొనసాగుతోంది. తుడా చైర్మన్ పదవి కోసం టీడీపీ, జనసేన నేతలు ఎవరికి వారు ప్రయత్నాలు చేస్తున్నారు. కూటమి ప్రభుత్వంలోని అధినాయకులు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, మరో వైపు మెగాస్టార్ చిరంజీవి సైతం తన అనుచరులకు ఇప్పించుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇటీవల అమరావతిలో జరిగిన సీఎం, డిప్యూటీ సీఎం భేటీలో తుడా చైర్మన్ పదవి విషయం గురించి ప్రస్తావన వచ్చినట్లు తెలిసింది. అమరావతి నుంచి అందుతున్న సమాచారం మేరకు.. సీఎం చంద్రబాబు మనసులో ఒకరుంటే.. మంత్రి లోకేష్ బాబు మనసులో ఇంకొకరు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే వీరిద్దరు కలిసే ఒక నిర్ణయం తీసుకునే అవకాశాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. మరో వైపు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ డాక్టర్ హరిప్రసాద్ కోసం ప్రయత్నిస్తుంటే.. చిరంజీవి మాత్రం ప్రముఖ నిర్మాత ఎన్వీ ప్రసాద్‌కు ఇప్పించేందుకు కృషి చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

**యాదవ్ అలిగారా?**

తిరుపతి ఎమ్మెల్యే టికెట్ ఎప్పటి నుంచో ఆశిస్తున్న వారిలో యాదవ సామాజిక వర్గానికి చెందిన నేత ఒకరు. ఇతను టీడీపీకి వీరవిధేయులు. పసుపు చొక్కా తప్ప మరొకటి ధరించరంటే ఆయన పార్టీపై ఎంత నిబద్ధత కలిగిన నాయకుడో అర్థం అవుతుంది. పార్టీ ఆవిర్భావం నుంచి టీడీపీనే నమ్ముకుని ఉన్న ఆయనకు ఎమ్మెల్యే కావాలనే కోరిక ఉంది. అందుకే 2014, 2019 సార్వత్రిక ఎన్నికల సమయంలోనూ తిరుపతి అసెంబ్లీ టికెట్ ఆశించి భంగపడ్డారు. ఆ సామాజిక వర్గం వారి అసంతృప్తిని చల్లార్చేందుకు నాటి టీడీపీ ప్రభుత్వ హయాంలో తుడా చైర్మన్ పదవి కట్టబెట్టారు. 2024 ఎన్నికల్లో తిరుపతి టికెట్ కోసం గట్టిగా ప్రయత్నం చేశారు. అయితే చివరి నిముషంలో జనసేన తన్నుకుపోయింది. టీడీపీ అధిష్టానం యాదవులను చిన్నచూపు చూస్తుందని ఆ సామాజిక వర్గం నేతలు తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారు. ఈ పరిస్థితుల్లో వారి అసంతృప్తిని చల్లార్చేందుకు ఆ సామాజిక వర్గం నేతకు యాదవ కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇచ్చి చేతులు దులుపుకున్నారనే ప్రచారం జరుగుతోంది. కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇచ్చి సామాజిక వర్గానికే పరిమితం చేసి చేతులు కట్టేశారని ఆయన అనుచరులు తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారు.

**టీడీపీ సానుభూతి పరుడికే తుడా**

సాధారణ ఎన్నికల్లో తిరుపతి అసెంబ్లీ జనసేనకు కేటాయించడంతో తుడా చైర్మన్ పదవినైనా టీడీపీ నేతకు కట్టబెట్టకపోతే పార్టీ మనుగడ ఉండదని స్థానిక నాయకులు అధినేత చంద్రబాబు, చినబాబు లోకేష్ తెల్చిచెప్పేశారు. దీంతో తిరుపతి తుడా చైర్మన్ పదవి టీడీపీ నేతకు తప్ప మరొకరికి ఇవ్వరని తేలిపోయింది. అందులో భాగంగా రెడ్డి సామాజిక వర్గానికి చెందిన కాంట్రాక్టర్ పేరు దాదాపు ఖరారైందనే ప్రచారం జరుగుతోంది. ఇతను గత ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే టికెట్ ఆశించి భంగపడ్డారు. అందుకని త్వరలో ఇతని పేరు ప్రకటిస్తారనే ప్రచారం జరుగుతోంది. అయితే అనూహ్యంగా రాజుల సామాజిక వర్గానికి చెందిన ఓ నేత పేరు అనూహ్యంగా తెరపైకి వచ్చినట్లు విశ్వసనీయ సమాచారం. ఆయన కుటుంబం టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీని నమ్ముకుని ఉండడం, అటు ఎన్టీఆర్ కుటుంబం, ఇటు నారావారి కుటుంబంతో మంచి సంబంధాలు ఉండడం వారికి అనుకూలాంశాలు. అలాగే 2014–19 మధ్య కాలంలో రాజు సామాజిక వర్గానికి చెందిన వారికి ఎటువంటి పదవి దక్కలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ దఫా ఆ సామాజిక వర్గానికి అవకాశం ఉందనే ప్రచారం జోరుగా సాగుతోంది.

**ఆ రెండు సామాజిక వర్గం నేతలకు లేనట్టే**

కూటమి పార్టీలోని జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులుకు తిరుపతి టికెట్ కేటాయించడంతో తుడా చైర్మన్ బలిజ సామాజిక వర్గానికి లేనట్టేనని తేలిపోయింది. దీంతో తుడా చైర్మన్ పదవిపై ఆశలు పెట్టుకుని మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, ఎన్వీ ప్రసాద్, డాక్టర్ హరిప్రసాద్‌కి ఇచ్చే అవకాశం లేదని కూటమిలోని ముఖ్యనేతలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. నరసింహయాదవ్‌కి కార్పొరేషన్ చైర్మన్ పదవి కట్టబెట్టటంతో తుడా చైర్మన్ పదవి ఆ సామాజిక వర్గం వారికి కూడా లేదని చెప్పకనే చెబుతున్నారు. కమ్మ వర్గం నేతలకు ఇస్తారనుకుంటే.. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని అదే సామాజిక వర్గం నేత కావడంతో వారికి ఉండదని విశ్లేషకుల అభిప్రాయం. ఇస్తే గిస్తే.. రెడ్డి, లేదా రాజు సామాజిక వర్గం వారికే తుడా చైర్మన్ పదవి ఖాయమనే ప్రచారం జరుగుతోంది.

### దాడి కేసులో ఒకరికి జైలు

**తిరుపతి లీగల్:** విధినిర్వహణలోని హోంగార్డుపై దాడి చేసిన కేసులో తిరుపతి పోస్టల్ కాలనీ పులిగోరు అపార్ట్‌మెంట్‌కు చెందిన మేదర మిట్ట విక్రమ్ చౌదరికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ తిరుపతి ఆరో అదనపు ప్రత్యేక మెజిస్ట్రేట్ రాణాప్రతాప్ గురువారం తీర్పు చెప్పారు. ఈస్ట్ స్టేషన్ సీఐ రామకృష్ణ, కోర్టు కానిస్టేబుల్ అయ్యప్ప తెలిపిన కేసులోని వివరాల మేరకు... 2015 జూలై మూడో తేదీ సాయంత్రం 5.30 గంటల సమయంలో నిందితుడు విక్రమ్ చౌదరి స్థానిక కర్నాల వీధిలో ఓ షాపు ముందు తన కారును నిలిపాడు. ఆ సమయంలో రోడ్డుపై ట్రాఫిక్ జామ్ కావడంతో విధి నిర్వహణలోని హోంగార్డు ఇర్ల సిద్దయ్య రోడ్డుపై ఆపిన కారు వద్దకు వచ్చి వివరాలు అడిగాడు. దీంతో నిందితుడు విక్రమ్ చౌదరి కారు డోరు తీయగా హోంగార్డు కిందపడ్డాడు. తర్వాత హోంగార్డు కాలరు పట్టుకుని అతనిపై దాడికి పాల్పడ్డాడు. చుట్టుపక్కల ప్రజలు వచ్చి అతని బారి నుంచి హోంగార్డును కాపాడారు. హోంగార్డు సిద్దయ్య ఈస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేసి, నిందితుడు విక్రమ్ చౌదరిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి విక్రమ్ చౌదరికి ఏడాది జైలుశిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ ప్రేమ్ సాగర్ వాదించారు.

### వ్యక్తి ఆత్మహత్య కేసులో ఒకరి అరెస్టు

**నాగలాపురం:** రుణదాతల వేధింపులు తాళలేక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న కేసులో ఒకరిని అరెస్టు చేసినట్లు నాగలాపురం ఎస్ఐ సునీల్ తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. నాగలాపురం సాయినగర్‌లో శేఖర్(62) అనే వ్యక్తి నివాసం ఉండేవారు. ఈ క్రమంలో అదే గ్రామంలోని కుమ్మరవీధికి చెందిన భరత్(28) వద్ద శేఖర్ రూ.11 లక్షలు అప్పు తీసుకున్నాడు. అతను అప్పు తిరిగి చెల్లించలేకపోవడంతో శేఖర్ ఇంటిని భరత్ తన పేర రాయించుకున్నాడు. అంతటితో ఆగక నిత్యం శేఖర్‌ను భరత్ వేధింపులకు గురిచేశాడు. రుణదాత వేధింపులు తాళలేక శేఖర్ ఆరు నెలల కిందట ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. ఈ నేపథ్యంలో నిందితడు భరత్‌ను బుధవారం పోలీసులు అరెస్టు చేసి, పుత్తూరు కోర్టులో హాజరుపరిచాడు. అనంతరం నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

## యథేచ్ఛగా ప్రభుత్వ స్థలం ఆక్రమణ

పన్నీరు కాల్వ మార్గంలో వాగు పోరంబోకు స్థలంలో అక్రమ నిర్మాణం



**రేణిగుంట:** రేణిగుంట మండలంలోని తిరుపతి–చెన్నై మార్గంలో ఉన్న తూకివాకం పంచాయతీ పన్నీరు కాల్వ గ్రామానికి వెళ్లే దారిలో విలువైన ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం అవుతున్నాయి. హైవే నుంచి పన్నీరుకాల్వ గ్రామానికి వెళ్లే దారిలో సర్వే నంబర్ 929లో 1.36 ఎకరాలు కాలువ పోరంబోకు స్థలం ఉంది. జాతీయ రహదారికి ఆనుకుని ఉండడంతో ఇక్కడ అంకణం ధర రూ.1.5 లక్షలు పైనే పలుకుతోంది. దీంతో కొందరు ఈ విలువైన భూములపై కన్నేశారు. అమ్మవారి ఆలయ నిర్మాణం పేరుతో నిర్మాణాలు చేపట్టారు. పక్కనే కొందరు గడ్డివాములు వేసి ఆక్రమించుకున్నారు. మరి కొందరు ఆ విలువైన ప్రభుత్వ భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తుండడంతో స్థానికులు జిల్లా ఉన్నతాధికారులకు ఈ అక్రమణలపై ఫిర్యాదు చేశారు. విలువైన ప్రభుత్వ భూమిని పరిరక్షించాలని కోరుతున్నారు.

### సౌత్‌జోన్ ఫుట్‌బాల్ జట్టు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో అధికారులు, కోచ్, మేనేజర్

**తిరుపతి సిటీ :** కాలికట్ వేదికగా ఈనెల 21 నుంచి జరగనున్న సౌత్‌జోన్ ఇంటర్ వర్సిటీ టోర్నమెంట్‌కు ఎస్వీయూ పురుషుల విభాగపు ఫుట్‌బాల్ జట్టును గురువారం అధికారులు ప్రకటించారు. ఎస్వీయూ పరిధిలోని డిగ్రీ కళాశాలల నుంచి ఫుట్‌బాల్ నందు పేరొందిన 20 మందితో కూడిన ఆటగాళ్ల బృందాన్ని అధికారులు ప్రకటించి వారికి టోర్నమెంట్‌కు అవసరమైన కిట్లను అందజేశారు. కార్యక్రమంలో వర్సిటీ మాజీ ఫుట్‌బాల్ ప్లేయర్ నజీరుద్దీన్, కోచ్ సుదర్శన్, టీమ్ మేనేజర్ గఫూర్, డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ శివశంకర్ రెడ్డి ఎంపికైన క్రీడాకారులను అభినందించారు.

### దివ్యాంగ క్రికెట్ పోటీల నమోదుకు నేడు తుది గడువు

**తిరుపతి సిటీ:** త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి దివ్యాంగ క్రికెట్ పోటీలకు ఆసక్తిగల అభ్యర్థులు శుక్రవారం లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆ కమిటీ చైర్మన్ సూర్యనారాయణ తెలిపారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్, దివ్యాంగ క్రికెట్ కమిటీ, ఏపీ దివ్యాంగ క్రికెట్ కౌన్సిల్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న దివ్యాంగ క్రికెట్ క్రీడాకారుల ఎంపిక ప్రక్రియ తేదీని ఈనెల 21న ప్రకటించనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు చిత్తూరు జిల్లా కన్వీనర్ నాగరాజును 9985882559, 7780167625 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

## మహిళ దారుణ హత్య

- అక్క కాపురం బాగుండాలని అత్తను చంపిన అల్లుడు

**తిరుపతి క్రైం:** నగరంలోని సింగాలగుంటలో ఓ మహిళను దారుణంగా హత్య చేసిన సంఘట గురువారం వెలుగులోకి వచ్చింది. అలిపిరి సీఐ రామకిషోర్ కథనం మేరకు.. సింగాలగుంటలో నివాసముంటున్న జోగారావు, కొబ్బరికాయల వ్యాపారి వెంకటలక్ష్మి దంపతులకు కొడుకు విజయ్(26), కూతురు(నాగలక్ష్మి) ఉన్నారు. అదే వీధిలోని ద్రాక్షాయణి(50)కు పురుషోత్తం అనే కుమారుడు ఉన్నాడు. ఈ క్రమంలో నాగలక్ష్మి, పురుషోత్తం ప్రేమించుకుని 2013లో వివాహం చేసుకున్నారు. వివాహానంతరం పురుషోత్తం తల్లికి దూరంగా ఉండేందుకు భవానినగర్‌లో కాపురం పెట్టాడు. పురుషోత్తం ఇంటికి సమీపంలో ఫొటో ఫ్రేమ్‌లు తయారు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే నాగలక్ష్మి పురుషోత్తం వద్ద డబ్బులు తీసుకుని పుట్టింటి వారికి ఇస్తున్నట్లుగా వీరిద్దరి మధ్య తరచూ గొడవలు జరిగేవి. ఈ క్రమంలో బుధవారం రాత్రి కూడా గొడవ చోటు చేసుకుంది. దీంతో నాగలక్ష్మి కుటుంబ సభ్యులందరూ వచ్చి పురుషోత్తంతో గొడవపడ్డారు. పురుషోత్తం ఇంట్లో నుంచి అలిగి వెళ్లిపోయాడు. వీరు కూడా నాగలక్ష్మిని సింగాలగుంటలోని పుట్టింటికి తీసుకొచ్చారు. ఈ గొడవలకు అంతా కారణం పురుషోత్తం తల్లి ద్రాక్షాయణి అని నాగలక్ష్మి తమ్ముడు విజయ్ భావించాడు. ఆమె చచ్చిపోతే తన అక్క కాపురం బాగుంటుందని, నిరంతరం ఆమె కారణంగానే గొడవలు వస్తున్నాయని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి 11 గంటల ప్రాంతంలో కొబ్బరికాయలు కొట్టే కత్తి తీసుకుని సింగాలగుంటలోని పురుషోత్తం తల్లి ద్రాక్షాయణి ఇంటికి వెళ్లి, ఆమె తలపై కత్తితో నరికాడు. దీంతో ఆమె కింద పడిపోయింది. దీంతో చుట్టుపక్కల వారు గమనించి, ఆమెను ఓ ప్రైవేట్ ఆస్పత్రికి, అక్కడి నుంచి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆమె గురువారం వేకువజామున 5.30 గంటలకు మృతి చెందింది. పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. నాగలక్ష్మి తమ్ముడు విజయ్‌ని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.



ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ రాంకిషోర్

## అన్న మృతిపై అనుమానంతో తమ్ముడి ఫిర్యాదు

- పూడ్చిన మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం

**బుచ్చినాయుడుకండ్రిగ:** తన అన్న తొట్టంబేడు మండలం దొంగలముదురు గ్రామానికి చెందిన ఉదయ్ కుమార్ (40) మృతిపై తనకు అనుమానం ఉన్నట్లు తమ్ముడు భానుప్రసాద్ బుచ్చినాయుడుకండ్రిగ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై తొట్టంబేడు తహసీల్దార్ మధుసూదన్‌రావు సమక్షంలో పూడ్చిన మృతదేహాన్ని వెలికితీసి గురువారం పోస్టుమార్టం నిర్వహించారు. సీఐ తిమ్మయ్య, ఎస్ఐ విశ్వనాథనాయుడు కథనం మేరకు.. తొట్టంబేడు మండలం దొంగలముదురు గ్రామానికి చెందిన ఉదయ్ కుమార్ బుచ్చినాయుడుకండ్రిగ మండలం పల్లమాల గ్రామ చెరువు వద్ద గత జూన్ 21వ తేదీన శవమై పడి ఉన్నాడు. దీంతో స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో క్రైస్తవ మత ఆచారంతో ఖననం చేశారు. అయితే అన్న మృతిపై తమ్ముడు భానుప్రసాద్‌కు అనుమానం రావడంతో బుచ్చినాయుడుకండ్రిగ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన సీఐ తిమ్మయ్య, ఎస్ఐ విశ్వనాథనాయుడు గురువారం దొంగలముదురు గ్రామ శ్మశానంలో పూడ్చిన ఉదయ్‌కుమార్ శవాన్ని బయటకు తీసి, తహసీల్దార్ సమక్షంలో వైద్యులు హరిత, జ్యోతి ప్రసూన పోస్టుమార్టం నిర్వహించారు. కేసు నమోదు చేసి పూర్తి స్థాయిలో నిజానిజాలను తెలుస్తామని తెలిపారు.

## జిల్లా విపత్తు సహాయనిధికి శ్రీసిటీ పరిశ్రమలు రూ. కోటి విరాళం

- ఐలాకు అంబులెన్స్ వితరణ




పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజుకు రూ. కోటి విరాళం అందజేస్తున్న శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, పరిశ్రమల ప్రతినిధులు

**శ్రీసిటీ (వరదయ్యపాళెం):** వరద సహాయక చర్యల్లో భాగంగా శ్రీసిటీ పారిశ్రామిక కుటుంబం (సీఎస్ఆర్) సామాజిక బాధ్యతల్లో భాగంగా జిల్లా విపత్తు సహాయనిధికి శ్రీసిటీ పరిశ్రమలు రూ.కోటి విరాళం అందజేశాయి. ప్రభుత్వ పరిశ్రమల శాఖ కార్యదర్శి డాక్టర్ యువరాజ్, సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం సమక్షంలో శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి విరాళం చెక్కును తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్‌కు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీసిటీ, ఇతర పరిశ్రమల భాగస్వామ్య సమష్టి కృషిని డాక్టర్ యువరాజ్ ప్రశంసించారు. ఈ తరహా సాయం సామాజిక బాధ్యత, సమాజం సంక్షేమంపై కార్పొరేట్ రంగం నిబద్ధతను ప్రతిబింబిస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ నిధులు ఈ ప్రాంతంలోని వరద బాధితులకు సకాలంలో సాయం అందించడంతో పాటు వారు తిరిగి కోలుకోవడంలో కీలక పాత్ర పోషిస్తాయని జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ చెప్పారు. బాధిత కుటుంబాలకు తన సంఘీభావం తెలియజేసిన డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి విపత్తు సహాయక కార్యక్రమాలకు మద్దతు ఇవ్వడంలో శ్రీసిటీ నిబద్ధతను పునరుద్ఘాటించారు. ఉదార విరాళాలతో సహకరించిన పారిశ్రామిక భాగస్వాములందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సూళ్లూరుపేట ఆర్డీఓ కిరణ్మయి పాల్గొన్నారు.

**టీహెచ్‌కే ఇండియా పరిశ్రమ చే అంబులెన్స్ విరాళం**

కార్పొరేషన్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్)లో భాగంగా శ్రీసిటీలోని లీనియర్ మోషన్ గైడ్లను ఉత్పత్తి చేసే ప్రముఖ జపనీస్ పరిశ్రమ టీహెచ్‌కే ఇండియా రూ. 29లక్షల విలువైన అంబులెన్స్‌ను శ్రీసిటీ ఇండస్ట్రియల్ ఏరియా లోకల్ అథారిటీ (ఐలా)కు వితరణగా అందజేశారు. ఈ వాహనాన్ని లాంఛనంగా పరిశ్రమల శాఖ కార్యదర్శి ద్వారా ఐలాకు అందజేశారు.

### అరగొండ అపోలోలో సర్జరీ విజయవంతం



సమావేశంలో మాట్లాడుతున్న సర్జన్లు

**తవణంపల్లి:** మండలంలోని అరగొండ అపోలో హాస్పిటల్‌లో అత్యాధునిక విధానం ద్వారా షోల్డర్ రీప్లేస్‌మెంట్ సర్జరీ విజయవంతంగా నిర్వహించినట్లు ఆర్థోపెడిక్ సర్జన్లు పమ్మి కార్తీక్‌రెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి వెల్లడించారు. ఈమేరకు గురువారం మండలంలోని అరగొండ అపోలో ఆస్పత్రిలో వారు విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. సంప్రదాయ పద్ధతుల ద్వారా జరిగే షోల్డర్ రీప్లేస్‌మెంట్ సర్జరీలో నేడు నూతన శకం ఆరంభమైందన్నారు. అరగొండ అపోలో ఆస్పత్రిలో కూడా అత్యాధునిక విధానం అందుబాటులో ఉందన్నారు. ఈ సర్జరీలో నొప్పి శాతం చాలా తక్కువగా ఉంటుందని, రోగులు త్వరగా కోలుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో మేనేజర్ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


## చేపా..చేపా.. చెరువులోకెప్పుడెళతావ్!

- సీజన్ ముగిశాక... చేప పిల్లలకు గ్రీన్‌సిగ్నల్

**తిరుపతి అర్బన్:** సీజన్ ముగిశాక...చెరువుల్లో చేపపిల్లలు వదిలిపెట్టాలంటూ ప్రభుత్వం నుంచి మత్స్యశాఖకు గురువారం గ్రీన్‌సిగ్నల్ వచ్చింది. వరుస తుపాన్లతో అన్ని చెరువులు నిండాయి. ఏటా నవంబర్‌లో చేప పిల్లలను వదిలిపెట్టేవారు. అయితే ఈ ఏడాది డిసెంబర్ ముగుస్తున్న తరుణంలో చేప పిల్లలకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వంతో టెండర్లు ఎప్పుడు ఆహ్వానిస్తారు?.. ఆ తర్వాత జిల్లాకు ఎప్పుడు తీసుకొస్తారు. చెరువుల్లో వదిలిపెట్టడానికి ఎంత సమయం పడుతుంది.. ఇలా మత్స్యశాఖ అధికారులకు అన్ని ప్రశ్నలే మిగిలాయి.

**గత ఐదేళ్లలో ఏటా సకాలంలోనే చేపపిల్లలు**

గత ఐదేళ్లలో ప్రతి ఏటా 60 లక్షల నుంచి కోటి చేపపిల్లలను బాపట్ల నుంచి తిరుపతి జిల్లాకు సెప్టెంబర్ 10వ తేదీలోపు దిగుమతి చేసేవారు. రెండు నెలలపాటు తిరుపతి మత్స్యశాఖ జిల్లా కార్యాలయంలో జాలర్ల సమక్షంలో వాటి పెంచేవారు. తర్వాత నవంబర్ 10 నుంచి 30వ తేదీలోపు జిల్లాలోని మత్స్యశాఖ పరిధిలోని 134 సొసైటీ చెరువుల్లో చేపపిల్లలను వదిలిపెట్టేవారు. అంతేకాకుండా కాళంగి, కల్యాణ్‌డ్యామ్, అరణియార్ ప్రాజెక్టుకు చేపపిల్లలను ఇచ్చేవారు. ఆ తర్వాత మిగిలిన చేపపిల్లలను ఇతర ఇరిగేషన్, పంచాయతీ రాజ్ పరిధిలోని చెరువులకు వదిలిపెట్టేవారు.



ప్రస్తుతం తిరుపతి జిల్లా మత్స్యశాఖ కార్యాలయం చేపపిల్లల తొట్టెల పరిస్థితి

**ఈ ఏడాది సీజన్ పూర్తి అయ్యింది...**

ఈ ఏడాది మరో పది రోజుల్లో డిసెంబర్ పూర్తి కానుంది. ఈ సమయంలో చేపపిల్లలను తెచ్చి తిరుపతిలో పెంచడానికి సమయం లేదు. మరోవైపు తిరుపతి మత్స్యశాఖ కార్యాలయంలో చేపపిల్లలను పెంచడానికి తొట్టెలు సక్రమంగా లేవు. చేపపిల్లలు వచ్చినప్పటికీ నేరుగా వాటిని చెరువుల్లో వదిలిపెట్టాల్సి ఉంది. చేపపిల్లలను చెరువుల్లో వదిలిపెట్టడానికి మత్స్యవ్యాపారుల నుంచి ప్రభుత్వం టెండర్లు ఆహ్వానించాల్సి ఉంది. టెండర్లు దక్కించుకున్న వారు జిల్లాల వారీగా చెరువులకు పంపాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ పూర్తి చేయడానికి మరో నెల రోజుల సమయం పడుతుంది. అంటే వచ్చే ఏడాది జనవరి 20 తర్వాతే. అయితే మార్చికే చెరువుల్లో నీటిమట్టం తగ్గిపోతుంది. దీంతో దిగుబడి తగ్గి నష్టాలు వాటిల్లే ప్రమాదం పొంచి ఉంది.

**నెలాఖరుకల్లా చేప పిల్లలు వదిలే ప్రయత్నం చేస్తాం**



చెరువులకు చేపపిల్లలు వదిలిపెట్టడానికి ప్రభుత్వం నుంచి గ్రీన్‌సిగ్నల్ వచ్చింది. జిల్లాలో 134 మత్స్యశాఖ పరిధిలోని సొసైటీ చెరువులు ఉన్నాయి. ఆ చెరువులకు 68 లక్షల చేపపిల్లలు అవసరం ఉంది. అయితే ఇప్పటి వరకు 30 చెరువులకు పూర్తిగా నీరు రాలేదు. 104 చెరువులు మాత్రమే పూర్తిగా నిండాయి. మరోవైపు కాళంగి.అరణియార్ ప్రాజెక్టులు పూర్తిగా నిండాయి. కల్యాణ్ డ్యామ్ 70 శాతమే నీరు ఉంది. టెండర్ల ప్రక్రియ పూర్తి అయిన తర్వాత చేపపిల్లలు వచ్చిన వెంటనే చెరువులకు వదిలిపెట్టే ప్రయత్నం చేస్తాం. జాలర్ల సమక్షంలో చేపపిల్లలను పెంచడానికి సమయం లేదు.

–నాగరాజు, మత్స్యశాఖ జిల్లా అధికారి